క్లుప్తంగా

18న జలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పాలం తోపులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18న మహాశివ రాత్రి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం రుద్రాభిషేకం, బిల్వార్చన, మంగళహారతి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రికి అంకాళపరమేశ్వరి తమిళనాటకం ఉంటుందని చెప్పారు. అర్ధరాత్రి లింగోద్భవ దర్శనాన్ని కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూల విగ్రహాలకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు.

నేడు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ఆయా పార్టీల నాయకులకు కలెక్టరేట్ అధికారులు సమాచారం పంపారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు.

హంసపై శివపార్వతుల విహారం



హంస వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఏకాంబరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం హంస, వృషభ వాహనాలపై విహరించారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి హంస వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వృషభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కైంకర్యాలకు యాదమరికి చెందిన దేవీరవిచంద్రన్, శాంతమ్మ, శ్రీనివాసపిళ్ళై ఉభయదారులుగా వ్యవహరించారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చెస్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ చాటారు. జిల్లా కేంద్రంలోని మురుగానిపల్లిలో ఉన్న న్యూయార్క్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ఆర్‌బీ. ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం ఆ పాఠశాల ఎండీ శ్రీధర్, తదితరులు బహుమతులు అందజేశారు. పురుషోత్తమన్ తిరుమలై మొదటి బహుమతి 10,000నగదుతోపాటు ట్రోఫీని అందుకున్నారు.మల్లేశ్వర రెండవ స్థానం రూ.6,000, రాజు మూడవ స్థానాన్ని రూ.4000 కైవసం చేసుకున్నారు. ఓపెన్ కేటగిరీలో మొత్తం 30 మందికి నగదు బహుమతిని అందజేశారు. చెస్ అసోసియేషన్ సభ్యులకు, చీఫ్ ఆర్బిటర్ రాజీవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బీజేపీ ప్రచారం



బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో..

చిత్తూరు కలెక్టరేట్: ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ అమలులోకి వచ్చిందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు. అయితే ఆ నిబంధనను బీజేపీ నాయకులు తుంగలో తొక్కారు. సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచార కరపత్రాలను ప్రభుత్వ ఉద్యోగులకు పంచారు.

ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేస్తున్న సిబ్బంది



పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



నిరుపేదలకు ఆరోగ్య భాగ్యం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వసతులు
- సకాలంలో వైద్యుల సేవలు
- అందుబాటులో మందులు
- పెరుగుతున్న రోగుల సంఖ్య

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వసతులను కల్పించడంలో ఖర్చుకు వెనుకాడకుండా అవసరమైన అని పరికరాలను సమకూరుస్తోంది. ఆరోగ్య కేంద్రంలోనే ఉచితంగా పలు రకాల పరీక్షలను చేయిస్తోంది. వైద్యులు, సిబ్బంది విధుల్లో పారదర్శకంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఫలితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందుతోంది. రోగుల తాకిడి క్రమంగా పెరుగుతోంది. వీంతోపాటు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలు అమలు చేస్తోంది. తద్వారా రోగులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయి.

పూతలపట్టు: నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల్లో మెరుగైన వసతులు, వైద్యం అందుబాటులో ఉంది. గతంలో పీహెచ్‌సీ అంటేనే చిన్నచూపు చూసేవారు. అక్కడ వైద్యంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తారన్న భావన ప్రజల్లో నాటుకుపోయింది. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరోగ్య కేంద్రంలోకి పరికరాలు వచ్చాయి. వైద్యులు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నాయి. పేదలకు ఆరోగ్యం ఉచితంగా సకాలంలో అందుతోంది.

పూతలపట్టు పీహెచ్‌సీలో మూడేళ్లకు ముందు అరకొరగా మందులు, మాత్రలు ఉండేవి. డాక్టర్లు, సిబ్బంది వచ్చే వరకు రోగుల పడిగాపులు కాయాల్సి వచ్చేది. వచ్చిన వైద్యులు కూడా వచ్చిన తూతుమంత్రంగా సేవలు అందించి సొంత క్లినిక్‌లకు పరుగులు తీసేవారు. పీహెచ్‌సీలో చేయాల్సిన పరీక్షల కోసం చీటి రాసిచ్చేవారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు దోపిడీ మొదలుపెట్టాయి. ఈ పీహెచ్‌సీకి అప్పట్లో రోజుకు 20 నుంచి 30 మంది మాత్రమే వచ్చేవారని అధికారుల గణంకాలు చెబుతున్నాయి.

నేడు ఎలా ఉందంటే...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు–నేడు ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మార్చేసింది. కావాల్సిన వసతులను సమకూర్చింది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై దష్టి పెట్టింది. ఇద్దరు డాక్టర్లు, వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు 12 మందిని నియమించింది. వారందరూ నిర్ణీత సమయానికి ఆస్పత్రిలో ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గర్భిణులకు ప్రతి బుధవారం ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు. హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, రక్తపరీక్ష, హీమోగ్లోబిన్, షుగర్, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. కాన్పులు కూడా ఇక్కడే ఉచితంగా చేస్తున్నారు. గత ఆరు నెలల్లో సుమారు వంద కాన్పులు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఒక్కో పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య 80 నుంచి 100మధ్యలోఉంది. వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించి భేష్ అనిపించుకుంటున్నారు.

ప్రైవేటు ఆస్పత్రికి దీటుగా



ప్రైవేటు ఆస్పత్రికి దీటుగా పీహెచ్‌సీ వచ్చే రోగులకు సేవలందిస్తున్నాం. హెచ్ఐవీ, షుగర్, మలేరియా వంటి వ్యాధులకు పరీక్షలు చేస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు రోగుల సంఖ్య పెరిగింది. అందుకు తగినట్లే సకాలంలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.

–డాక్టర్ ప్రవీణ, సివిల్ అసిస్టెంట్ సర్జన్, పూతలపట్టు

అందుబాటులో ఉన్నాయి



ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల పరికరాలు, సదుపాయాలు, కల్పించింది. ఇక్కడికి వచ్చిన ప్రతి రోగిని ప్రత్యేక శ్రద్ధతో పరీక్షించి మందులు, మాత్రలు ఇస్తున్నాం. వ్యాధి తగ్గని పక్షంలో ఇక్కడే కొన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం. ఇక్కడ వీలుకానీ పక్షంలో ప్రభుత్వ ఆస్పత్రికి మాత్రమే రెఫర్ చేస్తున్నాం.

–డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్

మంచి వైద్యమే..



చాలా రోజులుగా నాకు ఒళ్ళు నొప్పులు, తలనొప్పి, నీరసం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాను. పీహెచ్‌సీకి వెళితే డాక్టర్లు పరీక్షలు చేసి ఏవో కొన్ని మందులు, మాత్రలు ఇచ్చారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పారు. ఆ మందులు బానే పనిచేశాయి. ముందు కంటే ఇప్పుడు మంచి వైద్యమే అందిస్తున్నారు.

–దొరైరాజ్, పూతలపట్టు

కుష్టు వ్యాధిని నయం చేయవచ్చు



సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవిరాజు, దాత్రేయచౌదరి

తవణంపల్లె: కుష్టువ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే, పూర్తిగా నయం చేయవచ్చునని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా చేపట్టిన సర్వే ముగింపు సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్టుగా పరిగణించాలని సూచించారు. కుష్టు రహిత సమాజస్థాపనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల వైద్యాధికారి దాత్రేయచౌదరి మాట్లాడుతూ మండలంలో 15 రోజులుగా కుష్టు వ్యాధిపై సర్వే చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అరగొండ మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ, పుణ్యసముద్రం మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి అందించిన ఆర్థిక సాయంతో టీబీ రోగులకు దుప్పట్లు, దుస్తులు, చెప్పులు, సరుకులు డాక్టర్ రవిరాజు, డాక్టర్ దాత్రేయచౌదరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భారతి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు మణి, దయానందం, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, జయమ్మ, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల దీక్ష

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలపై కమిషనర్ స్పందించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం వారు రిలే దీక్ష చేపట్టారు. రామచంద్రయ్యతోపాటు యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు మణి, దాసరి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్: ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ హరి నారాయణన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) కలెక్టర్ చైర్మన్‌గా, ఏఆర్‌వోగా డీఆర్‌వో రాజశేఖర్, కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారి, ఇండిపెండెంట్ సిటిజన్ లేక జర్నలిస్ట్, మెంబర్ సెక్రటరీగా డీపీఆర్‌వో వ్యవహరించనున్నారు.

ఆహ్వానం



చిత్తూరు కార్పొరేషన్: ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్ సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో కలిసి తన కుమారుడి పెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన కుమారుడు సాయి బాలాజీ వివాహం మార్చి 3న చిత్తూరులో జరగనుంది. పెళ్లికి సీఎం కుటుంబసమేతంగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా బోధన

ఐరాల: విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధించి ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పుత్రమద్ది జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. గోరుముద్ద ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్ఎంకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా బోధించడం వల్ల విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందన్నారు. వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన బడి నాడు–నేడు పథకం కింద పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు.

జొన్నగురకలలో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: మండలంలోని జొన్నగురకల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, వైద్య సేవలందించినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. 104 శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గర్భిణులకు, బీపీ, షుగర్ రోగులకు పరీక్షలుచేసిన, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధి కనపడలేదా?



మాట్లాడుతున్న ఆరణి శివకుమార్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి టీడీపీ నాయకులకు కనబడటం లేదా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆరణి శివకుమార్ ప్రశ్నించారు. ఆయన సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై ఇటీవల నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తే దానిని టీడీపీ నాయకులు వక్రీకరించారన్నారు. మాజీ ఎంపీ ఆదికేశవుల కుటుంబ సభ్యులపై తమకు గౌరవం ఉందని వారిని కించపరచలేదన్నారు. సర్పంచ్‌గా కూడా గెలవలేని ఎమ్మెల్సీ దొరబాబు 40 వేల మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే సీకేబాబుతో కలిసి టీడీపీని దొరబాబు మోసం చేశారని విమర్శించారు. చిత్తూరులో గంగినేని చెరువు కట్టపై ఉన్న పార్కు , బైపాస్‌రోడ్డు విస్తరణ తదితర పనులు జరిగినట్లు వివరించారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, నాయకులు కృష్ణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

కేసులు సకాలంలో పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఆర్టీఐ దరఖాస్తులు, కోర్టు కేసులను సకాలంలో పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) దరఖాస్తులను సకాలంలో అందించాలని, శాఖాధిపతులు ప్రతివారం సమీక్ష నిర్వహించి, పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. కోర్టు కేసులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్ను వసూళ్లపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా పాత బకాయిల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పన్ను వసూళ్ల కోసం నియమించిన బృందాలు రోజూ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని సూచించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. వారాంతపు లక్ష్యాలను సాధించేందుకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులను సమన్వయం చేసుకొని పనులు వేగంగా జరిగేలా చూడాలని చెప్పారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా.లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల సాగు భేష్



ఐరాల: పూల తోటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, ఎంపీడీఓ నిర్మలాదేవి

ఐరాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల సాగు బాగుందని కేంద్ర బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, సుమన్ కితాబిచ్చారు. వారు సోమవారం మండలంలోని పాతపాళ్యం, రెడ్డివారిపల్లె, చినకాంపల్లె, 35 యర్లంపల్లె, కాణిపాకంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా చినకాంపల్లెలో తవ్విన కుంట పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. 35 యర్లంపల్లె, పాతపాళెంలో ఉపాధి నిధులతో సాగు చేసిన జామ, పూల తోటలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. రెడ్డివారిపల్లెలో సాగు చేసిన డ్రాగన్ పంటను పరిశీలించారు. కాణిపాకంలో అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను సంరక్షించాలని సూచించారు. రైతులను పండ్లతోటల సాగు వైపు మళ్లించడం చూసి అభినందించారు. కార్యక్రమంలో ఏపీడీ సునీల్, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఏపీఓ సంధ్య, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటి నిల్వ కట్టడాల తనిఖీ

తవణంపల్లె: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన నీటి నిల్వ కట్టడాలను సోమవారం సాయంత్రం కేంద్ర జలశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ కార్యాలయాల వద్ద ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన నీటి నిల్వ కట్టడాలను, రికార్డులను పరిశీలించారు. తర్వాత చిత్తూరు–అరగొండ జాతీయ రహదారిలో ఉపాధి నిధులతో రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను పరిశీలించారు. చెట్లు ఏపుగా పెరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వీరితోపాటు డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం, సామర్థ్య పెంపుదల ఏపీడీ సునీల్, తవణంపల్లె ఏపీఓ లలిత, ఈసీ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన వినతులకు తక్షణ పరిష్కారం

చిత్తూరు రూరల్: స్పందన వినతులకు తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ పార్వతి స్పష్టం చేశారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. తాజా అర్జీలతోపాటు పాత అర్జీలపై ఆరా తీశారు. అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. లోతుగా విచారణ చేపట్టాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. సమస్యలుంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ తదితరులు ఉన్నారు.

అర్జీల వెల్లువ

పూతలపట్టు: మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని తహసీల్దార్ విజయభాస్కర్ నిర్వహించారు. కార్యక్రమంలో రైతుల దగ్గర నుంచి అధికంగా అర్జీలు వచ్చాయని తెలిపారు. పాసుపుస్తకంలో పేర్లు మార్చటం, భూ సమస్యలు వంటివి వచ్చాయని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చిన అర్జీల సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు తెలిపారు.

తహసీల్దార్‌కు విన్నపాలు

బంగారుపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల నుంచి ప్రజలు దారి సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలలో మార్పులు, చేర్పులు, భూముల సర్వే తదితర సమస్యలపై తహసీల్దార్ బెన్నురాజ్‌కు అర్జీలు అందజేశారు. మండలంలోని రాగిమానుపెంట, బండ్లదొడ్డి గ్రామాల్లో శ్మశాన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వినతిపత్రాలను అందజేశారు. సమస్యలపై స్పందించిన ఆయన వీఆర్‌ఓల ద్వారా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పందన సమస్యలపై వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

తొలి ప్రాధాన్యం

ఐరాల: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని తహసీల్దార్ సుశీలమ్మ ఆదేశించారు. తహసీల్దార్ కార్యలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.







చిత్తూరు: అర్జీల స్వీకరణలో తహసీల్దార్ పార్వతి, పూతలపట్టు: రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్, ఐరాల: స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుశీలమ్మ

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి జబ్బురోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 66 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 41 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు.